# కూతురిని వేధిస్తున్నాడనే కక్షతో హోటల్ కార్మికుడి హత్య!



మాదాపూర్ (హైదరాబాద్):

కూతురిని వేధిస్తున్నాడనే కక్షతో ఓ హోటల్ కార్మికుడిపై ఇద్దరు వ్యక్తులు కత్రులతో విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేసిన ఘోర సంఘటన మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఉప్పర్‌పల్లి గ్రామానికి చెందిన సెనేపల్లి భాస్కర్ మాదాపూర్‌లోని ధృవ కాలేజ్ సమీపంలో గల హోటల్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. భాస్కర్ గత కొంతకాలంగా వరంగల్ జిల్లా హనుమకొండకు చెందిన నిందితుడు రాజు కుమార్తెను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో కక్ష పెంచుకున్న రాజు, తన బావ కుమారస్వామితో కలిసి మంగళవారం రాత్రి హనుమకొండ నుండి హైదరాబాద్‌కు వచ్చాడు. రాత్రి సుమారు 11:47 గంటల సమయంలో సదరు హోటల్ వద్ద భాస్కర్‌తో గొడవకు దిగి, ఇద్దరూ కలిసి కత్రులతో అతనిపై తీవ్రంగా దాడి చేసి అక్కడి నుండి పరారయ్యారు.

సమాచారం అందుకున్న మాదాపూర్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, తీవ్రంగా గాయపడిన భాస్కర్‌ను చికిత్స నిమిత్తం కొండాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే బుధవారం తెల్లవారుజామున 01:05 గంటల ప్రాంతంలో ఆసుపత్రికి తీసుకువచ్చే సమయానికే భాస్కర్ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. డయల్-100 ద్వారా అందిన సమాచారంతో సత్వరమే స్పందించిన పోలీసులు, ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని నిందితులు రాజు , కుమారస్వామి ల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

# గురుకుల పాఠశాలలో 'కంటి వెలుగు' ప్రారంభం...

## 40 మందికి ఉచిత అద్దాలు



నెల్లూరు జిల్లా రాపూరు (బిఎన్ఎస్): -నెల్లూరు జిల్లాలోని రాపూరు మండలంలోని కండలేరు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో వేపినాపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో 'కంటి వెలుగు' (ఐ స్క్రీనింగ్) కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. వైద్యాధికారి డాక్టర్ వి.వి. సూర్య ధర్మేంద్ర, ఆప్తాల్మిక్ ఆఫీసర్ గురవయ్యల నేతృత్వంలో పాఠశాలలోని 597 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో దృష్టి లోపం ఉన్నట్లు తేలిన 40 మంది విద్యార్థులకు ప్రభుత్వం తరఫున ఉచితంగా కంటి అద్దాలను అందజేయనున్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో 5వ తరగతి నుండి ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులందరికీ రాబోయే 7 నెలల పాటు ఈ కంటి పరీక్షలు నిర్వహిస్తామని, విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు. ఈ శిబిరంలో గురుకుల ఉపాధ్యాయులు, ఆరోగ్య శాఖ సూపర్వైజర్ కిషోర్, ఏఎన్ఎంలు లక్ష్మి, గౌరి, హెల్త్ అసిస్టెంట్లు సుధాకర్, రత్నయ్య, ఆశా కార్యకర్తలు లక్ష్మమ్మ, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

# 3.65 కోట్లతో కేజీబీవీలో స్కూల్ ట్రాన్స్‌ఫార్మేషన్ కార్యక్రమం ప్రారంభం




నల్లగొండ (బిఎన్ఎస్): యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని కేజీబీవీ పాఠశాలలో 3.65 కోట్ల సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన 'స్కూల్ ట్రాన్స్‌ఫార్మేషన్', 'ఐ-స్పార్క్' కార్యక్రమాలను భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతితో కలిసి ఈ రోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 20 ప్రభుత్వ పాఠశాలల్లో 4,673 మంది విద్యార్థినుల కోసం సోలార్ ఫెన్సింగ్, బంకర్ బెడ్స్, ఆధునిక రోబోటిక్, సైన్స్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. నాణ్యమైన విద్యతోనే విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకుంటారని పేర్కొన్నారు.

# నవోదయ విద్యాలయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం-జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



నల్లగొండ (బిఎన్ఎస్): వచ్చే విద్యాసంవత్సరం లో జవహర్ నవోదయ విద్యాలయలో 6 వ తరగతిలో ఉచిత నివాస ప్రవేశాల కు అర్హులైన వారినుండి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ సహాయం పొందే (ఎయిడెడ్), లేదా గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం 5 వ తరగతి చదువుతున్న విద్యార్థులు నవోదయ విద్యాలయలో 6 వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని ఆయన తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 31 లోగా www.navodaya.gov.in ద్వారా ఉచితంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ ఏడాది నవంబర్ 28నజరిగే రాత పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.. కావున జిల్లాలోని అర్హులైన గ్రామీణ మరియు పట్టణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# పేకాట స్థావరంపై పోలీసులు దాడి

## నగదు, సెల్‌ఫోన్లు, బైకులు స్వాధీనం



నెల్లూరు జిల్లా సైదాపురం (బిఎన్ఎస్): -నెల్లూరు జిల్లా సైదాపురం మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం వెనుక కొండ దిగువ భాగంలోని పొదల్లో పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారంతో బుధవారం ఉదయం సైదాపురం ఎస్ఐ దుర్గాప్రసాద్, తన సిబ్బందితో కలిసి ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 8,750 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వస్తువులను తదుపరి విచారణ, నిమిత్తం సైదాపురం పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లుతెలిపారు.

# వాహనాల అద్దెలు పెంచాలి ..

నల్లగొండ (బిఎన్ఎస్):అద్దె వాహనాల నెలవారీ అద్దె చార్జ్ 4 వేల నుంచి 55 వేలకు పెంచాలని కోరుతూ ప్రైవేటు వాహనాల యజమానులు, డ్రైవర్లు నల్గొండ కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు.. పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు నిర్వహణ ఖర్చులు భారీగా పెరిగినందున వాహనాల అద్దె పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు.. గత 12 నుంచి 22 నెలలుగా వాహనాల అద్దె బకాయిలు చెల్లించక పోవడం తో వాహనదారులు ఇక భరించలేని స్థితిలో ఆందోళనలకు సిద్ధమయ్యామని తెలిపారు.. అద్దె వాహన దారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.... రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెలో భాగంగా నల్లగొండ జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టామని , సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు...

# ఏపీలో కొత్త టెక్నాలజీ భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం



అమరావతి , జూలై 15(బిఎన్ఎస్) : భూ యజమానులకు వంద శాతం భద్రత గత వైసీపీ ప్రభుత్వం ప్రజల, ప్రభుత్వ భూములు కాజేసేందుకు భూ రికార్డులను గందరగోళంగా మార్చింది. రెవెన్యూ వ్యవస్థను భ్రష్టు పట్టించింది. లక్షల కొద్ది ప్రభుత్వ, ప్రయివేట్ భూములను వైసీపీ నేతలు అక్రమించుకున్నారు. ఈ నేపథ్యంలో నిజమైన భూ యజమానుల హక్కులకు భద్రత కల్పించేందుకు కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో రెవెన్యూ శాఖలో 40కి పైగా సంస్కరణలు అమలు చేసింది. కొత్త కొత్త టెక్నాలజీలను ప్రవేశపెట్టింది. రానున్న కాలంలో అర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ కూడా ఉపయోగించుకొని అత్యాధునిక టెక్నాలజీ ద్వారా భూ వివాదాలకు శాశ్వతంగా చెక్ పెట్టాలని పని చేస్తోంది. అలాగే రెవెన్యూ, రిజిస్ట్రేషన్ సేవలను సులభతరంగా, పారదర్శకంగా, అవినీతికి ఆస్కారం లేకుండా అందించేలా కృషి చేస్తోంది.

భూ రికార్డులను ఎవరూ తారుమారు చేయకుండా ఉండేందుకు ప్రభుత్వం బ్లాక్‌చెయిన్ విధానాన్ని అమలు చేస్తోంది. దీని ద్వారా రికార్డుల్లో ఏ చిన్న మార్పు చేసినా సులభంగా ట్రాక్ చేయవచ్చు. ఇది హ్యాకింగ్‌కు, డేటా టాంపరింగ్‌కు అవకాశం లేని అత్యంత సురక్షితమైన వ్యవస్థ. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలను రియల్ టైమ్ లో అనుసంధానించారు. వెబ్‌ల్యాండ్ మరియు రిజిస్ట్రేషన్ సాఫ్ట్‌వేర్‌లను సమర్థవంతంగా అనుసంధానించారు. ఒక ఆస్తి రిజిస్ట్రేషన్ కాగానే ఆటోమేటిక్‌గా మ్యుటేషన్ (పేరు మార్పిడి) జరిగి, రెవెన్యూ రికార్డులు తక్షణమే అప్‌డేట్ అవుతున్నాయి. దీనివల్ల ఒకే భూమిని ఇద్దరికి అమ్మే మోసాలకు అడ్డుకట్ట పడింది. ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ లాకింగ్ సదుపాయాన్ని కల్పించారు. రైతులు తమ వేలిముద్ర లేదా ఆధార్ ద్వారా తమ భూమిని 'లాక్' చేసుకునే విప్లవాత్మక సదుపాయం తెచ్చారు. దీంతో యజమాని అనుమతి లేకుండా భూమి బదిలీ లేదా మ్యుటేషన్ ఇంకేవరూ చేయలేరు. రిజిస్ట్రేషన్ సమయంలో ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ ఈ-కేవైసీని అమలు చేస్తున్నారు. కొనుగోలు, అమ్మకందారుల గుర్తింపును బయోమెట్రిక్ విధానం (వేలిముద్రలు, ఐరిస్) ద్వారా పక్కాగా నిర్ధారిస్తున్నారు. దీనివల్ల బినామీ, నకిలీ వ్యక్తులతో జరిగే రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన రీ సర్వేలో తప్పులను సరిదిద్ది కూటమి ప్రభుత్వం పట్టిష్టంగా రీ సర్వేను నిర్వహిస్తోంది. ఇందులో భూముల సరిహద్దు వివాదాలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కచ్చితమైన కొలతలతో మ్యాపింగ్ చేయడానికి డ్రోన్లు మరియు కంటిన్యూయస్ ఆపరేటింగ్ రిఫరెన్స్ స్టేషన్స్(ఓశీఠీం) సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. వందల ఏళ్ల కాలం నుండి ఉన్న పాత భూ రికార్డులన్నింటినీ డిజిటలైజ్ చేస్తున్నారు. ఏఐ సహకారంతో 2026 చివరి నాటికి రాష్ట్రంలో ఉన్న పాత రికార్డులన్నింటినీ శాశ్వత డిజిటల్ గుర్తింపుతో భద్రపరుస్తారు.

ప్రజలు సులభతరంగా భూముల రిజిస్ట్రేషన్ చేసుకునేలా రిజిస్ట్రేషన్ శాఖ స్లాట్ బుకింగ్ సిస్టమ్ ను ప్రవేశపెట్టింది. ఆన్లైన్ లో ముందుగానే స్లాట్ ను బుక్ చేసకొని కార్యాలయానికి వచ్చిన పది నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రకియ పూర్తయి వారి మొబైల్స్ కు వాట్సాప్ ద్వారా డాక్యుమెంట్ వస్తుంది. డాక్యుమెంట్ హార్డ్ కాపీ గంటలో అందజేస్తున్నారు. ఇక ఎన్ ఆర్ ఐలు తమ భూముల అమ్మకం, కొనుగోళ్లకు జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ డాక్యుమెంట్ రిజిస్టర్ చేసుకోవడంలో అవకతవకలను నిరోధించేందుకు వీడియో ఈ-కేవైసీని ప్రవేశ పెట్టారు. కుల, ఆదాయ, నివాస పహాణీ/అడంగల్ వంటి రెవెన్యూ ధృవపత్రాల జారీని పూర్తిగా ఆన్‌లైన్ చేశారు. గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా వచ్చే దరఖాస్తులను నిర్ణీత సమయంలో డిజిటల్ సంతకాలతో మంజూరు చేస్తున్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సర్టిఫికెట్లు నేరుగా దరఖాస్తుదారుల మొబైల్‌కు, డిజిలాకర్‌కు చేరేలా వ్యవస్థను సులభతరం చేశారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు సులభంగా, మధ్యవర్తులు లేకుండా అందేలా మన మిత్ర' అనే వాట్సాప్ ఆధారిత ప్లాట్‌ఫారమ్‌ను ఏపీ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ యాప్ ద్వారా 26 రకాల రెవెన్యూ సేవలను పొందవచ్చు. దరఖాస్తు చేయడం, స్థితిని ట్రాక్ చేయడం మరియు సర్టిఫికేట్లు పొందడం వంటివన్నీ డిజిటల్ పద్ధతిలోనే జరుగుతాయి.

రానున్న కాలంలో మరిన్ని టెక్నాలజీలను అందుబాటులోకి తీసుకొచ్చి ప్రజలకు సులభతరంగా సేవలు అందించడంతోపాటు భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించబోతున్నారు. భవిష్యత్తులో తీసుకురాబోయే టెక్నాలజీలతో రాష్ట్రంలో నూరు శాతం అవినీతి రహిత, వివాద రహిత రెవెన్యూ వ్యవస్థ సాకారం కానుంది.

# ఆదూరుపల్లిలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం



నెల్లూరు జిల్లా రాపూరు (బిఎన్ఎస్): -నెల్లూరు జిల్లాలోని రాపూరు మండలంలోని ఆదూరుపల్లి గ్రామంలో బుధవారం "పొలం పిలుస్తోంది" కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి పొదలకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కె. శివ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో వరి, ఇతర వివిధ పంటలలో ఆశించే తెగుళ్లు, వాటిని సకాలంలో గుర్తించి నివారించే పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. పంట దిగుబడి పెరగాలంటే శాస్త్రీయ పద్ధతులను పాటించడం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా వరి ఇతర పంటలలో వచ్చే రకరకాల తెగుళ్లు, వాటి నివారణకు వాడాల్సిన మందుల మోతాదుల గురించి వివరించారు. పంటలకు అనవసరంగా రసాయన ఎరువులు వేసి ఖర్చులు పెంచుకోకుండా, సకాలంలో తగిన మోతాదులో ఎరువుల యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారులు, సిబ్బందితో పాటు ఆదూరుపల్లి గ్రామ రైతులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# జెడ్పీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి లోకేష్




బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జూలై 15: కడపజిల్లాలో పర్యటించిన విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం మధ్యాహ్నం ప్రొద్దుటూరు మండలం దొరసానిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మౌలిక సదుపాయాలను పరిశీలించడంతో పాటు విద్యార్థుల అభ్యసన ఫలితాలు, పాఠశాల పనితీరుపై ఆరా తీశారు. ముందుగా పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులతో మంత్రి సంభాషించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల అందజేత, వాటి నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఇరాన్-అమెరికా యుద్ధాన్ని ఎంతమంది గమనిస్తున్నారని అడిగారు. విద్యతో పాటు శారీరక వ్యాయామం ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు.

### నా భవిష్యత్ మీపై ఆధారపడి ఉంది

మీకు మార్కులు రాకపోతే నా మార్కులు పోతాయని విద్యార్థులను ఉద్దేశించి ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. నా భవిష్యత్ మీపై ఆధారపడి ఉంది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రజాప్రభుత్వం విశేషంగా కృషిచేస్తోంది. అన్ని రకాల సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోంది. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, యూనిఫాం, షూ, తల్లికి వందనం పథకాలను అమలుచేస్తోందని వివరించారు. అనంతరం అందరితో కలిసి మంత్రి నారా లోకేష్ ఫోటోలు దిగారు.

# తాళ్లరాంపూర్ సర్పంచ్ దివంగత పావని కుటుంబానికి మెండోరా సర్పంచ్‌ల అండ

- సర్పంచ్ ఫోరం తరపున రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేత
- కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం
- కష్టకాలంలో అండగా ఉంటామని భరోసా



ఏర్గట్ల,(బిఎన్ఎస్) జూలై 15: తాళ్లరాంపూర్ గ్రామ సర్పంచ్ బెజ్జరాపు పావని ఆకస్మిక మరణం పట్ల మెండోరా మండల సర్పంచ్‌లు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు పావని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబం ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితుల్లో తమ వంతు సహాయంగా మెండోరా మండల సర్పంచ్ ఫోరం తరపున రూ.50,000 ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ పావని ప్రజాసేవలో అంకితభావంతో పనిచేసిన ప్రజాప్రతినిధి అని కొనియాడారు. ఆమె మరణం స్థానిక సంస్థల వ్యవస్థకు తీరని లోటని పేర్కొన్నారు. పావని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన సర్పంచ్‌లు, కష్టకాలంలో తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. ప్రజాసేవలో ఆమె చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మెండోరా మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు వేల్పూర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బుట్టడి ప్రమోద్ కుమార్, బుస్సాపూర్ సర్పంచ్ నూతపల్లి శ్రీనివాస్, నడిమిడి తండా సర్పంచ్ రవి నాయక్, పోచంపాడ్ సర్పంచ్ రాజు, దూద్గాం సర్పంచ్ బాబా, వెల్కటూర్ సర్పంచ్ కావ్య సతీష్, సోన్‌పేట్ సర్పంచ్ నర్సవ్వ మల్లేష్, చాకిర్యాల్ సర్పంచ్ బద్రి శ్రీనివాస్, నెహ్రూనగర్ సర్పంచ్ డాబాడి ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ ప్రభుత్వ పనితీరును కొనియాడిన కేటీఆర్



ఢిల్లీ,బిఎన్ఎస్: ఏపీ ప్రభుత్వ పనితీరును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. ఎల్‌నినో పరిస్థితుల్లోనూ నీటి సమస్య రాకుండా ఆ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ క్లిష్ట సమయంలోనూ పట్టిసీమ నుంచి నీటిని ఎత్తిపోస్తూ రైతుల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేస్తోందని చెప్పారు. ఈ విషయంలో ఆ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత.. తెలంగాణ ప్రభుత్వం ఇవ్వట్లేదన్నారు. సముద్రంలోకి పోయే నీటి వినియోగానికి ఏపీ అన్ని ప్రయత్నాలు చేస్తోందని కేటీఆర్ పేర్కొన్నారు. ఢిల్లీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మేడిగడ్డ విషయంలో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) తీరుపై కేటీఆర్ విమర్శలు చేశారు. "గతంలో పోలవరం డయాఫ్రమ్ వాల్ దెబ్బతింటే.. ఎన్డీఎస్ఏ పట్టించుకోలేదు. మేడిగడ్డ పిల్లర్ కుంగితే మాత్రం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. మేడిగడ్డ బ్యారేజీపై నివేదిక ఇచ్చింది ఎన్డీఎస్ఏ కాదు.. ఎన్డీఏ. తెలంగాణలో కోటి ఎకరాలకు పైగా నిషేధిత జాబితాలో చేర్చారు. రెవెన్యూ మంత్రి 30 శాతం వసూళ్లు చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలకు చేస్తున్న పనులకు పొంతన లేదు. కాళేశ్వరంపై ఆయన పగబట్టి వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ఇంజినీర్లు ఇచ్చిన నివేదికను బయటపెట్టాలి. గత రెండేళ్లలో కేసీఆర్ ఏ ఒక్కరి పేరు పెట్టి విమర్శలు చేయలేదు. రేవంత్‌కు మాత్రం.. కేసీఆర్ పేరు తలవని రోజు లేదు. రెండు రోజులు ఢిల్లీలోనే ఉన్న సీఎం.. ఎన్డీఎస్ఏ అధికారులను ఎందుకు కలవలేదు? ఎన్డీఎస్ఏ ప్రాథమిక నివేదికకు.. తుది నివేదికకు చాలా వ్యత్యాసం ఉంది. మేడిగడ్డపై చూపిన శ్రద్ధ.. మిగతా రాష్ట్రాలపై ఎందుకు చూపలేదు?" అని కేటీఆర్ ప్రశ్నించారు.

